సమయం శెట్టి బాలయతో మాట్లాడాడు.

''ఇది మా సమయంవారి నిర్ణయం. ఆరుమాసాల పాటు అమ్మకాలపై వసూలు చేసింది లెక్కించి పక్కన పెట్టాం. ఆ మొత్తాన్ని దండనాయకుడు మారయ.. తనకే ఇవ్వాలని మా నుంచి తీసుకున్నాడు. ఆయన.. 'గుడికి నేనే చెల్లిస్తాను!'. అంటాడు. మేమేం చెయ్యాలి?''.

దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు తలపంకించాడు జాయప.

మరొక వారం కాకతితో కబుర్లు..

తర్వాత ఊరి మహాజనుల సభ వారితో మాట్లాడాడు. దేవరిభట్టు ఆ ఊరి మహాజనుల సభ సమయశెట్టి.

''అంతా దైవేచ్ఛ. ఆ వ్యాపారస్తులు తమ ఆదాయంలో కొంత సొమ్ము కానుకగా చెల్లించడానికి సిద్ధపడి.. పాపం, తన అమ్మకాల కష్టంలో నుంచి లెక్కతీసి పక్కన పెడితే.. ఆ దండనాయకులవారు తాను చెల్లిస్తానని తీసుకున్నాడట..''

మరో వారం గడిచాక దండనాయకుడు మారనను పిలిపించాడు జాయపుడు.

''అంతా గుడికే కదా మహారాజా.. నేను వసూలు చేసి చెల్లిస్తే వాళ్లకు ఏమిటిట సమస్య?''.

''అదే మేమూ చెబుతున్నాం. మేం చెల్లించగలం కదా. ఆయనెవరు మధ్యలో చెల్లించడానికి? దండనాయకుడు మారయ ఎప్పుడూ మాపై పెత్తనం చెయ్యాలని భావిస్తాడు. మా హక్కులు మేం ఎలా వదలుకుంటాం? ఈ గ్రామంలో ఏదైనా మా వృత్తి సమయాల శెట్టి ద్వారానే జరగాలి..'' అన్నాడు గ్రామ సమయశెట్టి సుక్కయ.

అనుమకొండ వెళ్లామని నిర్ణయించుకున్నాక.. ముందునాడు సమావేశం ఏర్పాటుచేశాడు జాయపుడు.

నానదేశీ పెక్కండ్రు సమయ ప్రతినిధులు, మహాజనుల ప్రతినిధి, గ్రామవృత్తి సమయశెట్టి, ఇతర వృత్తి శెట్టిలు, దండనాయకుడు, గ్రామాధికారులు.. అందరూ హాజరయ్యారు. ఇక్కడ మళ్లీ చర్చ జరిగింది. ఎవరి వాదన వారు చెప్పారు.

'కానుక సొమ్ము మండల కోశాగారం ద్వారా నేనే ఆలయానికి చెల్లిస్తాను!' అంటాడు దండనాయకుడు.

'గ్రామంలో ఏదైనా.. సమయానిదే హక్కు!' అంటాడు శెట్టి.

తర్జనభర్జనల అనంతరం ఈ అంశంలో గ్రామ సమయాల వారిదే నిర్ణయాధికారం అని ప్రకటించాడు జాయపుడు. సాధారణంగా తీర్పు వచ్చాక ఎవ్వరూ వ్యతిరేకించరు. శిరసావహిస్తారు.

జాయపుని తీర్పుతో సమస్య పరిష్కారమైంది. విజయవంతంగా అయన్నవోలు తగవుతీర్చిన రాజప్రతినిధిగా ఆ గ్రామప్రజల నిర్ణయాలను శ్రీవాకిలి నారయ నాయకుడికి లిఖితపూర్వకంగా అందించాడు. చక్రవర్తికి అత్యంత ఇష్టుడు కనుక జాయపుడు చేసిన గ్రామ తీర్పు అంశం చక్రవర్తి చెవిన కూడా వేశారెవరో.

నాట్యం కోసం గ్రామం వెళ్లినా.. సామాజిక బాధ్యత మరువలేదని జాయపుణ్ని మెచ్చుకున్నారు కూడా.

నవ్వాడు గణపతిదేవుడు. ఆయన నవ్వులో మాధుర్యం తొణికిసలాడింది.

* * *

శంభుర్గౌరీ తథా బ్రహ్మ మాధవో నందికేశ్వరః
దత్తిలోకోహళస్త్వవ యాజ్ఞావల్క్యశ్చ నారదః
హనుమాన్విఘ్న రాజశ్చ షణ్ముఖోథ బృహస్పతిహి
అర్జునో రావణస్త్వవ కన్యా బాణసుతాతతః
ఏ తే భరత కర్తారో భువనేషు ప్రకీర్తితాః

శివుడు, పార్వతి, బ్రహ్మ, విష్ణువు, నందికేశ్వరుడు, దత్తిలుడు, కోహళుడు, యాజ్ఞవల్క్యుడు, నారదుడు, ఆంజనేయుడు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు, బృహస్పతి, అర్జునుడు, రావణుడు, ఉషాకన్యక.. వీళ్లందరినీ భరతశాస్త్ర కర్తలు అంటారు. కాబట్టి ఆయా మహానుభావులు రచించిన గ్రంథాలు సంపాదించి, వాటిని తీక్షణంగా అధ్యయనం చేస్తుంటాడు జాయపుడు.

ఉదయం ఆసనాలు, వ్యాయామం, ధ్యానం, పూజ అన్నీ కార్యక్రమాలూ గణపతిదేవునితోనే.

ద్వీపం నుంచే మొదలయ్యింది ఆ అలవాటు.

అనంతరం గురుకులానికి వెళతాడు. తిరిగి వచ్చి గ్రంథ పఠనం, నాట్య, సాహిత్య, సంగీత గ్రంథాలు.. తెలుగులో ఇప్పుడిప్పుడే మొదలు. వాటితోపాటు సంస్కృత భాషలోనివీ పరిశీలిస్తూ నృత్తాభ్యాసం.. అన్నీ అక్క మందిరంలోనే. ఎప్పుడూ అక్క కనుసన్నల ముందే. రాజప్రాసాద నివాసి అయినా.. తన అనుమకొండ వీధి జీవనం మరిచిపోలేదు. దాని ప్రభావం అతని మీద ఎప్పుడూ ఉంటుంది. ఆ రోజుల్లో ఎప్పుడూ అక్కల గురించిన ధ్యాస వల్ల పూర్తిగా నిద్రపట్టేది కాదు. ఎల్లప్పుడూ జాగరూకుడై ఉండేవాడు. దాంతో సమయపాలన అతనికి బాగా పట్టుబడింది. పైగా గణపతిదేవునికి కూడా సమయపాలన అతిముఖ్యం.

తెల్లవారుఝామున తొలికోడి కూతకు ముందే నిద్రలేస్తాడు. అతనికి సాధన ఎంత ముఖ్యమో.. ధ్యానం కూడా అంతే ముఖ్యం. గంటలు గంటలు ధ్యానంలో ఉండిపోతాడు జాయపుడు. నాట్యం, సంగీతం, గేయం, వాద్యం.. గజతంత్రాలు.. లాంటి ఆయన ప్రధాన నైపుణ్యాలన్నీ కొత్త కోణాలను ఆవిష్కరించేది ధ్యానంలోనే. అలాగే గ్రంథపఠనం, పరిశోధన.. ఒక్క లిప్తకాలం వ్యర్థం కాకుండా జరిగిపోతుంటాయి.

జాయపుడు నడిచినా, మాట్లాడుతున్నా.. అక్క బావలతో.. పిల్లలతో మాటామంతి నెరపుతున్నా.. అతని ధ్యాన లోకంలో.. సృజనాత్మక స్రవంతి నిర్విఘ్నంగా సాగిపోతుంటుంది. కొత్త కొత్త అనుభవాలు.. గొప్ప సంగతులు, గొప్ప వ్యక్తుల పరిణత వ్యక్తిత్వాలు ఆ స్రవంతిలో కలగలిసి అతని మేధోలోకాన్ని మరింత విస్తృత పరుస్తుంటాయి. గత అనుభవాలను బట్టి అతను రెండు పడవలపై అవలీలగా సాగిపోతున్నాడు.



**పన్నెండవ శతాబ్ది నాడు.. రాజ్య పాలకులకు యుద్ధ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో.. నిర్వహణ సామర్థ్యం, యుద్ధ తాంత్రికత కూడా అంతే ముఖ్యం. ఈ రెండిటినీ ఆపోశన పట్టినవారే రాజ్య వ్యవహారాలలో రాణించగలరు. అలా రాణిస్తున్న వీరయోధులు, కుర్రకారు.. చాలామంది జాయపునికి మిత్రులయ్యారక్కడ.**

ఒకటి కళాత్మకత.. మరొకటి యుద్ధ నైపుణ్యత.

రాజప్రాసాదానికి వచ్చాక గుర్రం విక్రమకు తోడుగా ఓ గజరాజునూ కొనుగోలు చేశాడు. దానికి ధీర అని పేరు పెట్టుకున్నాడు. రాజప్రాసాదంలోనే ఉదయాన్నే వ్యాయామం అయ్యాక.. విక్రమ, ధీరలతో ఎన్నో నైపుణ్యాలు అభ్యాసం చేస్తాడు. అలాగే నిరంతరం కళలలోకాల్లో మరెన్నో అభ్యాసాలు.. అనుసృజన!

రాజనగరిలో కూడా అతనికి చాలామంది మిత్రులయ్యారు. రాజనగరి నివాసులు అందరూ యుద్ధ విశారదులు. రాజ్య వ్యవహారాలలో మంచి నిపుణులు ఉంటారు. నివాసం ఇక్కడ ఉన్నా ఎక్కడెక్కడో, ఏదేదో పరిపాలనా పదవుల్లో కూడా ఉంటారు. కొందరు మండలేశ్వరులు కూడా ఉన్నారిక్కడ.

పన్నెండవ శతాబ్ది నాడు.. రాజ్య పాలకులకు యుద్ధ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో.. నిర్వహణ సామర్థ్యం, యుద్ధ తాంత్రికత కూడా అంతే ముఖ్యం. ఈ రెండిటినీ ఆపోశన పట్టినవారే రాజ్య వ్యవహారాలలో రాణించగలరు. అలా రాణిస్తున్న వీరయోధులు, కుర్రకారు.. చాలామంది జాయపునికి మిత్రులయ్యారక్కడ.

అందులో ముఖ్యుడు పుళిందకుడు. జాయపుని సరి ఈడు వాడు.

రాజదర్పంతోపాటు చిరునవ్వు సదా ముఖాన వెలుగుతూ ఉంటుంది.

రాజనగరిలో సమావేశమందిరం ఉంది. అక్కడ తరచుగా యువకులతో సమావేశాలు, క్రీడలు, సంగీత, సాహిత్య సమాలోచనలు ఏర్పాటు చేస్తూ.. అంతర్గతంగా రాచకుటుంబాల మధ్య పెళ్లి సంబంధాలు లాంటి కుటుంబ, వ్యక్తిగత అంశాలపై మధ్యవర్తిత్వం నెరపడం పుళిందకుని వ్యావృత్తి.

విదేశీ వణిజులకు కావాల్సిన వస్తుసామగ్రి సేకరించి అందజేయడం అతని ప్రధాన వృత్తి.

రాచనగరి సమావేశాలలో అసలు సిసలు రాజకులీన వర్గ ప్రపంచం జాయపునికి ఆవిష్కరణ అవుతుంటుంది.

నిజానికి అక్కడ నిర్దేశిత అంశంపై చర్చ కన్నా వారి వారి రాజ్యపరిధిలోని రాజకీయాలు, కుట్రలు కుతంత్రాలు.. ఒకరిపై ఒకరు చెప్పుకొనే చర్చలు ఎక్కువ. ఓ సంగీత సమావేశం అంటారు. కబుర్లు ఎక్కువ. సంగీతం వినడం తక్కువ. విశ్రాంతిగా గడపడం.. కలిసి కబుర్లు పంచుకోవడం ఎక్కువ.

ఎంతోమంది పరిచయమయ్యారు జాయపునికి. కానీ, ఎవ్వరితోనూ చతుష్పథం మిత్రుల్లా మనసులోకి తీసుకోలేకపోతున్నాడు. వారి భావాలతో తన అభిప్రాయాలను ముడి వేయలేకపోతున్నాడు. వాళ్లనుంచి ఉత్తేజితుడు కాలేకపోతున్నాడు. ఎవరి నుంచి కూడా ఏమీ నేర్చుకోలేకపోతున్నాడు. ఓ రాజ్యాంశంపై స్వేచ్ఛగా అభిప్రాయాలను పంచుకోవడం అతనికి కనిపించలేదు. వారి వారి వ్యక్తిగత ప్రతిభ చెప్పుకోవడం.. ఇతరులను తక్కువ చేసి మాట్లాడటం.. ఎవరెవరి మధ్యనో అనుబంధాలు, విరోధాలూ అన్నీ వీళ్లే సృష్టించే పుకార్లు ఎక్కువ. పగలబడి నవ్వి.. నవ్వించే త్రిపుర బృందం లేదిక్కడ. మహత్తర విద్య, సాంస్కృతిక అంశాలపై చర్చించి మంచి తాళపత్ర గ్రంథాలను ఇచ్చి చదివించే నాగంభట్టు లేడిక్కడ. మనసారా హత్తుకుంటే.. బతుకంతా భద్రత భావన కలిగించే కంటకదొర లేడిక్కడ. పల్లెటూర్లో చేలగట్టుపై దగ్గరగా కూర్చుని.. చెరుకుగడ చీల్చుకు తింటూ.. అర్థం పర్థంలేని ఏవో కబుర్లు చెప్పుకొనే కాకతి లేదిక్కడ. ■

(సశేషం)